క్లుప్తంగా

29న మున్సిపల్ సమావేశం

రేపల్లె: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ నిర్వహించనున్నట్లు కమిషనర్ విజయసారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశానికి చైర్పర్సన్ కట్టా మంగ అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

నగరం: అక్రమ మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం శుక్రవారం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నగరంలోని బ్యూరో స్టేషన్లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

చలి వేంద్రం ప్రారంభం



వేమూరు: స్థానిక బస్టాండ్ సెంటరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి ఎస్.లక్ష్మీ తిరుపతమ్మ బుధవారం ప్రారంభించారు. తొలిరోజు ప్రజలకు మజ్జిగా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సజ్జా శ్రీనివాసరరావు, కొండమూడి శ్యామ్ పాల్గొన్నారు.

బైబిల్ క్లాసుల నిర్వహణపై శిక్షణ

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో క్రైస్తవ బాల బాలికలకు చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్(సీబీసీ) క్లాసులు నిర్వహణలో భాగంగా బుధవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక రైలుపేటలోని పరిశుద్ధ మార్కు లూథరన్ దేవాలయ సంఘంలో కూడా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ దాసరి విజయ, సండే స్కూల్ టీచర్స్ కట్టుపల్లి సౌజన్య, కనపర్తి సుప్రియ, పయర్ల ఆషా, తలమాల మహాలక్ష్మి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్త నాదెండ్ల వేణు కుటుంబానికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాల మేరకు సోదరుడు మోపిదేవి హరినాథ్ పది వేలు సాయం బుధవారం అందించారు. అదే విధంగా పార్టీ నాయకుడు ముప్పల కుమార్రాజా ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, నాయకులు దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, చెన్ను కోటేశ్వరరావు, బండారు రామారావు, కూరేటి శ్రీనివాసరావు, రావూరి నాగేశరవర రావు, ఉల్లంగుంట శ్రీరామ మూర్తి పాల్గొన్నారు.

నేడు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

భట్టిప్రోలు: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను గురువారం సన్మానించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో మండలంలోని ఆళ్లమూడి, కోనేటిపురం, పల్లెకోన, రాచూరు, వెల్లటూరు, ఓలేరు, పెసర్లంక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించనున్నట్లు చెప్పారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి హాజరవుతారని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నగరం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రక్షిత తాగునీటి పథకాల నిర్వహణ, పనితీరును పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలని కోరారు. గ్రామాలలో అవసరమున్న ప్రదేశాలలో చేతి పంపులను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.రాధారమణ, ఈఓపీఆర్డీ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాకు చర్యలు

కర్లపాలెం: గ్రామ ప్రజలకు వేసవిలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని ఎంపీడీఓ రాంబాబు ఆదేశించారు. పంచాయతీ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, అంగన్వాడీ టీచర్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఏ వార్డులో తాగునీటి సమస్య ఏర్పడినా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

భట్టిప్రోలు: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని బుధవారం పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసుల కథనం.. కొల్లూరు మండలం జువ్వలపాలెం నుంచి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ను పెదపులివర్రు వద్ద సెబ్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది అడ్డగించి డ్రైవర్ పి. ప్రశాంత్ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్, డ్రైవర్ను పోలీస్ స్టేషన్లో అప్పగించారు. భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల సత్తా



ఎస్.అనూష (901)



పి.తేజస్విని (892)



కె.గోపి (435)




కొక్కిలిగడ్డ రేవతి



చిత్తనూరి మీనాక్షి



ఎస్. కిరణ్మయి



అంబటి సాయి దుర్గా గణేష్



బట్టు ఈశ్వర్

బాపట్ల అర్బన్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాపట్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ప్రథమ ఏడాది ఎంపీసీ విభాగంలో గండూరి భవ్య 467, కొండపాటూరు గోపీనాథ్ 435 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో 988 మార్కులతో నామినేని బ్రాహ్మణి, అక్కల భవాని, 967 మార్కులతో జీ వర్షిని యామిని సత్తా చాటారు. బైపీసీలో 983 మార్కులతో నాయుడు రేవతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కాలేజీ యాజమాన్యం వెల్లడించింది. వీరికి శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్, అసోసియేట్ మోహన్ రావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.

వీజీఆర్ఎం విద్యార్థులు..

సీనియర్ ఇంటర్ ఎంపీసీలో రాముడు 989 మార్కులు, శృతి సమీర 987 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీలో నిహారిక వర్మ 983, ఆస్వాది కవిత 981 మార్కులు, జూనియర్ ఇంటర్లో కే ఐశ్వర్య 462 మార్కులు, సుసన్న మౌనిక 461 మార్కులు మార్కులతో ప్రభంజనం సృష్టించారు. వీరిని కళాశాల డైరెక్టర్లు ఆరేళ్ల విజయకుమార్, అంబటి గిరిధర్, మురళి అభినందించారు.

నారాయణ విద్యార్థులు..

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ షబానా సుల్తానా 989 మార్కులు, ఏ స్నేహలత 988, ఎండీ ఆసిఫ్ 987 సాధించారు. బైపీసీలో పీ సహన 982 మార్కులతో సత్తా చాటింది.

ఇంటర్ ఫలితాలలో బాలికల ప్రతిభ

కర్లపాలెం: ఇంటర్ ఫలితాలలో బాలికలు ప్రతిభ చాటారు. మండలంలోని పెనుమెత్స కోటంరాజు జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ ఏడాది ఎంపీసీ గ్రూపులో ఎస్.అనూష 1000 మార్కులకు గాను 901 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డీజీ నాయుడురెడ్డి తెలిపారు. పి.తేజస్విని 892 సాధించినట్లు వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో పి.ఇంద్రజ 470 మార్కులకు గాను 352 వచ్చినట్లు చెప్పారు.

ఇంటర్లో సత్తా చాటిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు

భట్టిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో భట్టిప్రోలు కేఎస్కే కళాశాలలో చదువుచున్న కొక్కిలిగడ్డ రేవతి, ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో 965 మార్కులు సాధించింది. అలాగే చిత్తనూరి మీనాక్షి బైపీసీ విభాగంలో 963 మార్కులు సాధించింది. ఎస్. కిరణ్మయి సీఈసీలో 953 మార్కులు సాధించింది. వెల్లటూరు రాఘవ జూనియర్ కళాశాల(శ్రీ గాయత్రి అకాడమి)కు చెందిన అంబటి సాయి దుర్గా గణేష్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో 964 మార్కులు సాధించాడు. ప్రథమ సంవత్సరంలో బట్టు ఈశ్వర్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో 456 మార్కులు సాధించాడు. అదే విధంగా ఎంఆర్ఆర్ అండ్ ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో వై.చాందిని 438 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా వీరిని కేఎస్కే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కత్తెర సురేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వర్ణలత, గాయత్రి అకాడమి డైరెక్టర్ కొండముది షణ్ముఖ శ్రీనివాసరావు(బాబీ), ఎంఆర్ఆర్ అండ్ ఏవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ భూపతి రమేష్ అభినందించారు.

జాబ్కార్డులున్న వారందరికీ పనులు కల్పించాలి

– డ్వామా పీడీ శంకర్నాయక్



కర్లపాలెంలో ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న డ్వామా పీడీ శంకర్నాయక్

కర్లపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్కార్డులున్న కుటుంబాల వారందరికీ పనులు కల్పించాలని బాపట్ల జిల్లా డ్వామా పీడీ వై.శంకర్ నాయక్ కోరారు. కర్లపాలెంలో చేపట్టిన పనులను బుధవారం పరిశీలించి, కూలీలకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ పని చేయటానికి వచ్చే కూలీలందరికీ ప్రతిరోజూ రూ.272 వచ్చే విధంగా సరిపడా పనులు చేయించాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 2 లక్షల పనిదినాలు పూర్తి చేయాలని ఏపీఓ సుందర్రావును ఆదేశించారు. ఏపీడీ భవానీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలందరూ తప్పనిసరిగా తాగేందుకు తాగునీరు, మజ్జిగ వెంట తెచ్చుకోవాలని చెప్పారు. వేసవి కాలంలో ఎండలు ముదరకముందే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కర్లపాలెం మండలంలో మొత్తం 788 పనులు గుర్తించి రూ.7.20కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుందర్రావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి

పిట్టలవానిపాలెం: రైతులు పొలాలను వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని బాపట్ల జిల్లా డీఆర్సీ డీడీఏ విజయలనిర్మల సూచించారు. మండలంలోని చందోలు శివారు పొలాల్లో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకంపై క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగుకు ఫాం నుంచి బ్రీడర్ సీడ్ అవసరమైన రైతులు పోస్టు కార్డు ద్వారా తెలియజేయాలని సూచించారు. లోతుగా దుక్కి చేయడం వల్ల భూమి లోపల పొరల్లో దాగి ఉన్న పురుగుల అవశేషాలు పైపొరలోకి వచ్చి ఎండ వేడిమికి చనిపోతాయని వివరించారు. రాబోవు పంటలో చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి బాపట్ల ఏడీఏ లక్ష్మి సూచించారు. సమావేశంలో ఎంపీపీ షేక్ బాజి, ఎంపీటీసీ సభ్యులు చల్లాపల్లి విజయరాజు, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ సలీంబేగ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లీలా శ్రీనివాసరెడ్డి, ఏఓ సత్యానంద్, ఏఈఓ సుదర్శన రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం కిట్లు పంపిణీ



జంపని రైతు భరోసా కేంద్రంలో పచ్చి రొట్ట విత్తనాలు అందజేసిన ఏడీఏ షేక్ హుసేన్

జంపని(వేమూరు): రైతులు ప్రకృతి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని రేపల్లె డివిజన్ వ్యవసాయాధికారి హుసేన్ తెలిపారు. జంపని గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు అనేక సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఖరీఫ్ సీజనకు ముందు రైతులకు వ్యవసాయ పెట్టుబడులు కోసం రైతు భరోసా ద్వారా డబ్బులు అదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పచ్చి రొట్ట ఎరువు కోసం సబ్సిడీపై విత్తనాలు అందించడం జరుగుతుందని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. పచ్చి రొట్ట ఎరువులు 30 రకాలు కిట్లు అందజేశారు. పచ్చి రొట్ట ఎరువుల వల్ల రసాయన ఎరువులు వాడకం తగ్గించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది చందన, మహాలక్ష్మి, గుమ్మడి నవీన్, పీఆర్పీ ప్రవీణ్ కుమార్, ప్రసాద్, ఎస్ఎఫ్ఏ, ఐసీఆర్పీ శ్రీకాంత్, శంకర్ రవి, తేజ, గోవతటి అనిత, రామస్వామి, కసుకుర్తి శైలజ, వాకా శాంత కుమారి పాల్గొన్నారు.

తెనాలి-చందోలు రోడ్డులో రాకపోకలపై నిషేదం

తెనాలి రూరల్: తెనాలి- చందోలు రోడ్డు మరమ్మతులు దృష్ట్యా వాహన రాకపోకలపై వారం రోజుల పాటు నిషేధం విధించినట్లు ఆర్అండ్బీ ఈఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపూడి కూడలి వద్ద రోడ్డు మరమ్మతులు చేస్తున్న కారణంగా కూడలి మీదుగా వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు పనులు జరుగుతాయని, ప్రజలు కూచిపూడి- గోవాడ మార్గంలో వెళ్లాలని సూచించారు.

29 నుంచి వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలు

భట్టిప్రోలు: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాలు 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. దివ్య రథోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం మహిళలు, కన్య పిల్లలతో బిందె తీర్థం, కలశాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి మహా సంప్రోక్షణ, మల్లెపూలతో వాసవి అమ్మవారికి సామూహిక పూజలు, సహస్రనామ పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పవిత్ర వేషధారణలు, భాజా భజంత్రీలు, పురందర దాస భజనలు, కోలాటాలు అత్యంత వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): సీతారాముల శాంతి కల్యాణం కనుల పండువగా బుధవారం నిర్వహించారు. పంచాయతీ గొడపాలెంలోని కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో స్వామివారి భక్తులు సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు సీతారాముల విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలు చేశారు. అన్నదానం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బాపట్ల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ బృందం బుధవారం తనిఖీ చేసింది. బాపట్లలోని ఎస్ఎం ప్రభుత్వ గరల్స్ హైస్కూల్లో రాగి జావను బృంద సభ్యులు పరిశీలించారు. అన్ని తరగతుల నుంచి 30 మంది విద్యార్థులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. పాఠశాలలో తయారు చేస్తున్న మెను, వెజిటబుల్స్ పలావును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బృందంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ అభిజిత్, సాయిదీపిక ఉన్నారు.

పంట ఆరబెట్టుకుంటున్న రైతులు



భట్టిప్రోలులో వర్షానికి తడిచిన మొక్క జొన్నను ఆరబెడుతున్న దృశ్యం

భట్టిప్రోలు: అకాల వర్షల ప్రభావంతో మాగాణిలో ఆరబెట్టిన మొక్కజొన్న దిగుబడులు, కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాల్లో ఆరబెట్టిన పసుపు వర్షానికి తడిచాయి. వాతావరణం తెరిపివ్వడంతో వర్షాల ధాటికి తడిచిన మొక్కజొన్న, పసుపు దిగుబడులను బుధవారం ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వేసవి తాపానికి అల్లాడుతున్న జనానికి ఈ వర్షం ఊరటనిచ్చింది. లంక గ్రామాల్లో అయితే ఇటీవల నాటిన అరటి పిలకలకు ఈ వర్షం జీవం పోసినట్లైంది.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పేటేరులో ఆధార్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

రేపల్లె రూరల్: ఆధార్ సేవలు ప్రజలకు త్వరితగతిన అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాలలో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారని పేటేరు గ్రామ సెక్రటరీ పుష్పకుమారి తెలిపారు. మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరు సచివాలయంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కనపర్తి రవికిరణ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది, మహిళలు

కర్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళ అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి కోరారు. బుధవారం వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీఓఏలు మార్కెట్ కమిటీ చైర్మన్గా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన సీతారామిరెడ్డిని ఆయన స్వగృహంలో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎన్.శ్రీనివాసులురెడ్డి, సీసీలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరరావు, లక్ష్మీసోమేశ్వరి, వీఓఏలు, మార్తమ్మ, నసీమా, వీరమ్మ ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్లో కేఎల్యూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేఎల్యూ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్ : పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కేఎల్యూ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయంలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిట్టు కుమార్, బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.వి.అశ్విన్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారని చెప్పారు.

బి ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చందన్కుమార్, ట్రిపుల్ ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చంద్రశేఖర్, ఫార్మాడీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.కౌబాయ్ ద్వితీయ స్థానాల్లో నిలిచి రజత పతకాలను సాధించారని వివరించారు. విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలలకు దాతల విరాళం



కొల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించిన పూర్వ విద్యార్థులు

కొల్లూరు(వేమూరు): మండల కేంద్రంలోని బాలురు, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలల అభివృద్ధికి దాతలు లక్ష రూపాయలు చొప్పన అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి తెలిపారు. కొల్లూరు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు ఇద్దరు నాగళ్ల నరహరిరావు దివంగత శేషమ్మ, జ్ఞాపకార్థం, గోగినేని తాతారావు తండ్రి గోగినేని వెంకటకృష్ణయ్య, తాతారావు భార్య రాజేశ్వరి జ్ఞాపకార్థం బాలురు, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలకు రూ.లక్ష చొప్పన బుధవారం డిపాజిట్ చేయడం జరిగిందని ఉషారాణి తెలిపారు. డిపాజిట్పై వచ్చే వడ్డీని మెరిట్ స్కాలర్ షిప్గా అందజేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి 1969–70 బ్యాచ్ విద్యార్థులను అభినందించారు.

30న అన్నమయ్య కీర్తనల పోటీలు

తెనాలిరూరల్: వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో అన్నమాచార్యుల వారి 615వ జయంతి సందర్భంగా అన్నమయ్య పాటల పోటీలను 30వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నమయ్య పాటల ప్రచారం నిమిత్తం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 29వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు కొండెపి శ్రీనివాసరావు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన 32 మంది విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో లక్కరాజు లక్ష్మణరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

కళాకారుడు రామకోటేశ్వరరావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్లో బుధవారం నిండు సంసారం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం ఎర్రకోటవీరుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పౌరాణిక నాటక కళాకారుడు మండల కిషోర్కుమార్ను ఘనంగా సన్మానించారు.27వ వార్డు బోయపాటి అరుణ, కోగంటి మణి, దివి నగరాజకుమారి, కోగంటి కోటేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలిరూరల్: ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో తెనాలి ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పోస్ట్మాస్టర్ తిరుపతమ్మ బుధవారం ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవాదళ్, ఆర్యవైశ్య యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా రెండో ఏడాది చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



పొన్నూరులోని టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తదితరులు

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల ప్రకారం రాబోయే రెండు నెలల్లో 40,728 గృహాల ప్రవేశాలు జరగాలనే దిశగా కృషి చేస్తున్నామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. బుధవారం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం, అడవితక్కెళ్ళపాడు గ్రామాల్లో నిర్మిస్తున్న టిడ్కో నివాసాలను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టుల వివరాలను సంబంధిత కాంట్రాక్టింగ్ ఏజెన్సీతో, ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించారు. అడవితక్కెళ్ళపాడులో 4192, పొన్నూరులో 2,368, నరసరావుపేటలో 1504 మొత్తం కలిపి 8,064 డాక్టర్ వైఎస్సార్ జగనన్న నగర్, జి+త్రీ గృహ సముదాయాలను టిడ్కో ఇంజినీర్లు, మునిసిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. పూర్తిస్థాయి సదుపాయాలతో రాబోయే రెండు నెలల్లో లబ్ధిదారులకు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏ.పి.టిడ్కో ద్వారా నిర్మాణం చేపట్టిన అన్ని పురపాలక సంఘాలలో పర్యావరణం పరిరక్షించే విధముగా బయో ఫెన్సింగ్ను ఏర్పాటు చేస్తూ వన్ మిలియన్ మొక్కలు నాటి లబ్ధిదారులకు అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు చిన కోటేశ్వరరావు ప్రసాదరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఏపీ టిడ్కో గృహాలను టిడ్కో చైర్మన్ జమాన్న ప్రసన్నకుమార్ బుధవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర పనుల గురించి ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ, టిడ్కో ఈసీ గేరా ప్రసాద్, మెప్మా పీడీ వెంకట నారాయణ ఉన్నారు.

త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు



పెరవలి త్యాగరాజ స్వామి జయంతి వేడుకల్లో మంజు భార్గవి

పెరవలి(వేమూరు): త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వేడుకలు బుధవారం నిర్వహించారు. జయంతి వేడుకల్లో సంగీత అకాడమి నాట్య శిరోమణి మంజు భార్గవి, డాక్టరు తాడేపల్లి లోక్నాథ్ శర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లాది సూరిబాబు, గ్రామ సర్పంచి దాది లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు పాల్గొన్నారు.

గుండి పార్వతి అమ్మవారికి పూజలు

భట్టిప్రోలు: స్థానిక గుండి పార్వతి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు భట్టిప్రోలు కార్తికేయశర్మ పూజలు జరిపారు. దేవాలయ వార్షికోత్సవం మే 4, 5 తేదీలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 4వ తేదీన గ్రామోత్సవం, ఉత్సవాలలో ప్రధాన ఘట్టం 5వ తేదీన జరుగుతుందని చెప్పారు.